సాక్షి
యాదాద్రి భువనగిరి
ఆదివారం । 7 । జూలై । 2024



ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధికి కృషి

గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. - 8లో



'ఫలక్‌నుమా'లో సాంకేతిక సమస్య

ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలు సాంకేతిక సమస్యతో శనివారం మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయింది. - 8లో

గరిష్ఠం / కనిష్ఠం
32^0 / 25^0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తులను త్వరగా ఆన్‌లైన్ చేయండి



ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

బొమ్మలరామారం(తుర్కపల్లి) : ప్రజాపాలన దరఖాస్తులను త్వరితగతిన ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఆదేశించారు. తుర్కపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆన్‌లైన్ చేసిన అనంతరం దరఖాస్తులను జాగ్రత్తగా భద్రపరచాలని స్పష్టం చేశారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ ఝాన్సీ లక్ష్మీబాయి ఉన్నారు.

కేజీబీవీ ఆవరణలో కంపచెట్ల తొలగింపు



చెట్లను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

గుండాల : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం పరిసరాల్లో మొలిచిన కంపచెట్లు, పిచ్చి మొక్కలను శనివారం గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై 'హాస్టళ్ల..అధ్వాన్నం' అనే శీర్షికతో శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి స్పందించారు. కేజీబీవీ ఆవరణ, పరిసరాల్లో చెత్త, పిచ్చి మొక్కలు, కంపచెట్లను తొలగించి శుభ్రం చేశారు.

చేనేత సమస్యలు పరిష్కరించాలని వినతి



శైలజా రామయ్యర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తడక రమేశ్

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లి చేనేత టై అండ్ డై ట్రస్ట్ చైర్మన్, జాతీయ అవార్డు గ్రహీత తడక రమేశ్ శనివారం హైదరాబాద్‌లో చేనేత, జౌళి శాఖ, హస్తకళల ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్‌ను కలిశారు. చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా చేనేత పొదుపు, చేనేత మిత్ర, నేతన్న బీమా పథకాలను కొనసాగించాలని కోరారు. బడ్జెట్‌లో చేనేతకు రూ.1000 కోట్లు కేటాయించాలని, సంఘాల్లో పేరుకుపోయిన చేనేత వస్త్రాలను వెంటనే కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంలో పోచంపల్లి పట్టుచీరను చేర్చి ఇవ్వాలని, పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కులో ఐఐహెచ్‌టీ సంస్థను నెలకొల్పాలని, చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని విన్నవించారు.

కౌలు రైతులకూ రైతుభరోసా ఇవ్వాలి



మాట్లాడుతున్న గోద శ్రీరాములు

మోత్కూరు : 15 ఎకరాలోపు రైతులతో పాటు కౌలు రైతులకూ రైతుభరోసా ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మోత్కూరులోని కేఆర్ భవన్‌లో మొగుళ్ల శేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వానాకాలం సీజన్ మొదలై నెలరోజులు గడుస్తున్నా రైతులకు పెట్టుబడి సాయం అందజేయడం లేదన్నారు.అభిప్రాయ సేకరణ పేరుతో మరింత జాప్యం చేస్తున్నారని, వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, నాయకులు కుసుమని హరిశ్చంద్ర, అన్నెపు వెంకట్, పాశికంటి లక్ష్మీనర్సయ్య, చాపల అంజయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పండుగకు సిద్ధం

వన మహోత్సవానికి ఏర్పాట్లు

- జిల్లా టార్గెట్ 18 లక్షల మొక్కలు
- 17 మండలాలు, ఆరు మున్సిపాలిటీల్లో నాటేందుకు ప్రణాళికలు
- 16 శాఖలకు లక్ష్యాలు ..
- అత్యధికంగా డీఆర్‌డీఓకు తొమ్మిది లక్షల మొక్కలు



భువనగిరి మండలం హన్మాపురం నర్సరీల్లో పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కలు

సాక్షి, యాదాద్రి : వన మహోత్సవానికి జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. గత ప్రభుత్వం తెలంగాణకు హరితహారం పేరుతో తొమ్మిది విడతలుగా కార్యక్రమాన్ని చేపట్టగా.. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ వనమహోత్సవం పేరుతో మొక్కలు నాటనుంది.గ్రామీణాభివృద్ధి, అటవీశాఖల ఆధ్వర్యంలో ఈ నెల రెండో వారంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. పదో విడతలో 18 లక్షల మొక్కలు నాటాలని అధికారులు నిర్దేశించారు.

16 శాఖల సమన్వయం..

జిల్లాలో 421 గ్రామ పంచాయతీలు, ఆరు మున్సిపాలిటీలు ఉన్నాయి. తొమ్మిది విడతల్లో 5 కోట్ల పైచిలుకు మొక్కలు నాటారు. అయితే గత మూడు విడతలుగా లక్ష్యాన్ని తగ్గించుకుంటూ వస్తున్నారు. నాటిన మొక్కలన్నీ క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు.తీసుకువచ్చిన మొక్కల్లో కొన్ని వృథా కాగా, నాటిన మొక్కల్లో 30 శాతం వరకు సంరక్షణ లేక ఎండిపోతున్నాయి. 2020లో 49.62 కోట్లు, 2021లో 27.82 కోట్లు, 2022లో 30.39 కోట్లు, 2023లో 22.99 కోట్ల మొక్కలు నాటారు. వృథాను అరికట్టేందుకు ఈసారి 18 లక్షల మొక్కలే నాటాలని లక్ష్యంగా నిర్దేశించారు. 16 శాఖల భాగస్వామ్యంతో వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తునానరు.

అనువైన ప్రతి చోట..

మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ సంస్థల పరిధిలో అనువైన ప్రతి చోట మొక్కలు నాటేందుకు ఆయా శాఖల వారీగా ప్రణాళికలు రూపొందించారు. రహదారులకు ఇరువైపులా, ఖాళీ స్థలాల్లో, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, నివాస గృహాల ఆవరణలు, చెరువు గట్లు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, అటవీ ప్రాంతాల్లో మొక్కలు నాటనున్నారు. 418 నర్సరీల్లో 30 లక్షల మొక్కలు రెడీగా ఉన్నాయి. ఇప్పటికే గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 4 లక్షల గుంతలు తీశారు. మిగతా శాఖలు కూడా ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి.

శాఖల వారీగా లక్ష్యాలు ఇలా..

మొక్కలు నాటేందుకు ప్రభుత్వ శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. అత్యధికంగా గ్రామీణాభివృద్ధి శాఖకు 9 లక్షలు, మున్సిపల్ 2,96,900, అటవీశాఖకు ఒక లక్ష చొప్పున కేటాయించారు. వ్యవసాయ శాఖకు 25 వేలు, ఉద్యాన 50 వేలు, పంచాయతీరాజ్ 2 లక్షలు, నీటిపారుదల 75వేలు, రోడ్డు, భవనాలు 25వేలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ 45వేలు, ఆబ్కారీ 40 వేలు, పరిశ్రమల శాఖకు 25 వేలు లక్ష్యంగా నిర్దేశించారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో భువనగిరిలో 1.61 లక్షలు, చౌటుప్పల్ 45 వేలు, ఆలేరు 35 వేలు, మోత్కూరు 28,900, యాదగిరిగుట్ట 25 వేలు, భూదాన్‌పోచంపల్లిలో 22 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు.

తొమ్మిది విడతల్లో నాటిన మొక్కలు (లక్షల్లో)

సంవత్సరం	మొత్తం
2015	33.627
2016	73.034
2017	114.98
2018	85.948
2019	70.11
2020	49.62
2021	27.82
2022	30.39
2023	22.99
మొత్తం	508.523



మొక్కల రకాలు

వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా వేప, కానుగ, ఖర్జూర, మద్ది, వెదురు, రావి, టేకు, మామిడి, సీతాఫలం, ఉసిరి, మునగ, నిమ్మ, జామ వంటి పండ్ల, పూల మొక్కలు నాటనున్నారు. ఇళ్ల ఆవరణలో నాటుకునేందుకు ఇంటింటికీ మొక్కలు అందజేయనున్నారు. మొక్కలు నాటిన అనంతరం రక్షణగా ట్రీగార్డులు ఏర్పాటు చేయనున్నారు. గతంలో నాటిన మొక్కలు చనిపోయినట్లయితే వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటనున్నారు.



భువనగిరి సమీపంలో మొక్కలు నాటడానికి సిద్ధం చేసిన గుంతలు

లక్ష్యం మేరకు నాటుతాం

వనమహోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టడానికి ప్రణాళిక సిద్ధం చేశాం. జిల్లా వ్యాప్తంగా 18 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించాం. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ శాఖలను భాగస్వామ్యం చేయడమే కాకుండా శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించాం. మొక్కలు నాటడానికి గుంతలు తీయిస్తున్నాం. లక్ష్యం మేరకు మొక్కలు నాటుతాం.

–హనుమంతు కే.జెండగే, కలెక్టర్


జంతు ప్రేమికా.. జాగ్రత్త!

- మూగజీవాల పెంపకంపై పెరుగుతున్న ఆసక్తి
- వ్యాధులు సంక్రమించే అవకాశం
- టీకాలు వేయించడం ద్వారా అరికట్టవచ్చంటున్న పశువైద్యులు



జూనోసిస్ డే సందర్భంగా భువనగిరిలో పెంపుడు కుక్కకు రేబిస్ నివారణ టీకా వేస్తున్న వైద్యుడు

భువనగిరి : కుక్కలు, పిల్లులు, కుందేళ్లు, పిచుకలు.. ఇలా రకరకాల జంతువులు, పక్షులపై ప్రేమ చూపించడం మంచిదే కానీ, వాటి వల్ల వ్యాధులు కూడా పొంచి ఉన్నాయి. పెంపకంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే వాటినుంచి ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని పశువైద్యులు హెచ్చరిస్తున్నారు. జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు పరస్పరం 100కు పైగా వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. వీటిలో రేబిస్, ఆంత్రాక్స్, బర్డ్‌ఫ్లూ, ప్లేగు వంటి ప్రాణాంతకమైన వ్యాధులు ఉన్నాయి. ప్రధానంగా కుక్క కాటు వల్ల రేబిస్ వ్యాధి సోకి ఏటా వేల సంఖ్యలో మృతి చెందుతున్నారు. తొలిసారి 1885 జూలై 6న ఫ్రాన్స్‌లో ఓ బాలున్ని పిచ్చికుక్క కరవడంతో రేబిస్ బారిన పడ్డాడు. దీంతో శాస్త్రవేత్త లూయీస్ పాశ్చర్ యాంటీ రేబిస్ టీకాను కనిపెట్టాడు. టీకా విజయవంతం కావడంతో ఆ రోజును యాంటీ రేబిస్, జూనోసిస్ డేగా జరుపుకుంటున్నారు. జూనోసిస్ డే సందర్భంగా పశువైద్య శాఖ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు వేస్తున్నారు.



ఈ ఏడాది కుక్క కాటు బారిన 4,958 మంది

పశు సంవర్థక శాఖ గణాంకాల ప్రకారం జిల్లాలో పెంపుడు కుక్కలు 5,023, వీధి కుక్కలు 5,647 వరకు ఉన్నాయి. వీటితో పాటు పిల్లులు, పశువులు, కుందేళ్లు, కోళ్లు పెంపుడు జంతువులుగా ఉన్నాయి. కాగా జిల్లాలో 2024 జనవరి నుంచి 4,958 మంది కుక్క కాటుకు గురయ్యారు. వీరందరికీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో టీకాలు ఇచ్చారు. కుక్కలు కరిచినప్పుడు రేబిస్ వ్యాప్తి చెందకుండా వాటికి పశువైద్య శాలల్లో టీకాలు వేస్తున్నారు. జూనోసిస్ డే రోజునే కాకుండా సాధారణ రోజుల్లోనై టీకాలు వేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని పశువైద్యశాలల్లో రేబిస్ నివారణ టీకాలు అందుబాటులో ఉన్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పెంపుడు జంతువులు ఇంట్లో ఉన్నప్పుడు వాటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలి.
- ఇంట్లో మల, మూత్ర విసజర్జన చేయకుండా బయటకు తీసుకెళ్లాలి.
- బెడ్‌పైకి వచ్చే పెట్స్‌ను మరింత శుభ్రంగా ఉంచాలి. అవి పడుకున్న బెడ్‌షీట్లను వెంటనే మార్చాలి. వాటిని ప్రత్యేకంగా వాష్ చేయాలి.
- శుభ్రంగా ఉన్నప్పుడు మాత్రమే చేరదీయాలి.
- వైద్యులు సూచనల ప్రకారం కుక్కలకు టీకాలు వేయించాలి.
- జంతువుల నుంచి లభించే ఆహార పదార్థాలైన పాలు, గుడ్లు, మాంసాన్ని బాగా ఉడికించి తినాలి.
- పెంపుడు జంతువులు కాటు వేసినా, గోర్లతో రక్కినా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

అవగాహన కల్పిస్తున్నాం

పెంపుడు జంతువుల పట్ల ప్రేమగా ఉండవచ్చు. కానీ, జాగ్రత్తలు కూడా తప్పనిసరిగా పాటించాలి. ఇటీవల కాలంలో కుక్కల బెడద పెరిగింది. చాలా మంది కుక్క కాటుకు గురవుతున్నారు. అటువంటి వారు తప్పనిసరిగా యాంటీ రేబిస్ టీకా వేయించుకోవాలి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో యాంటీ రేబిస్ టీకాలు అందుబాటులో ఉన్నాయి. కుక్కలు, పశువులు మృతి చెందితే వాటి కళేబరాలను కాల్చివేయాలి. తద్వారా జూనోటిక్ వ్యాధులను పూర్తిగా అరికట్టవచ్చు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

–డి.అయిలయ్య, జిల్లా పశువైద్యాధికారి

ఎయిమ్స్‌లో జూనోసిస్ డే



జూనోసిస్ డే సందర్భంగా నిర్వహించిన రంగోళి పోటీల్లో పాల్గొన్న వైద్యులు

బీబీనగర్ : ప్రపంచ జూనోసిస్ డేను శనివారం బీబీనగర్ ఎయిమ్స్ వైద్యకళాశాలలో మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూనోసిస్ వ్యాధుల నివారణ అనే అంశంపై రంగోళి పోటీలు నిర్వహించారు. జూనోసిస్ వ్యాధులు, వాటి నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా మాట్లాడుతూ జంతు ప్రేమికులు జాగ్రత్తగా పాటించాలని, లేనిపక్షంలో వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఎయిమ్స్ డీన్ రాహుల్‌నారంగ్, వైద్యులు లక్ష్మిజ్యోతి, నిఖత్‌షీరిన్, శ్యామల, రాజు, సునీల్‌చవాన్, మైక్రోబయాలజీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్



విలేకరులతో మాట్లాడుతున్న పాశం భాస్కర్

రామన్నపేట : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ విమర్శించారు. శనివారం రామన్నపేట అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగ యువతను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ సర్కార్ కూడా మోసం చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పార్టీ ఫిరాయింపులపై ఉన్న శ్రద్ధ పాలనపై లేదన్నారు. రైతుల రూ.2లక్షల రుణాలను ఆగస్టు 15లోపే మాఫీ చేయాలని, దొడ్డురకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు, నిరుద్యోగుల సమస్యలపై బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. సమావేశంలో దళితమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు పల్లపు దుర్గయ్య, నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ మైల నర్సింహ, కోకన్వీనర్ మదూరి ప్రభాకర్‌రావు, జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ, ఉపాధ్యక్షుడు పట్నం శ్రీను, జిల్లా కమిటీ సభ్యులు వనం అంజయ్య, బండ మధుకర్ రెడ్డి, దావనూరి వెంకటేష్, మిర్యాల రాజ్‌కుమార్, జంగిలి సత్యనారాయణ పాల్గొన్నారు.

వెనుకబాటుకు పాలకులే కారణం

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్



అడ్డగూడూరులో బునాదిగాని కాల్వను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

గుండాల, అడ్డగూడూరు : గుండాల, అడ్డగూడూరు మండలాలు అభివృద్ధిలో వెనకబడిపోవడానికి పాలక ప్రభుత్వాలే కారణమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ విమర్శించారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోరుయాత్ర శనివారం గుండాల, అడ్డగూడూరు మండలాల్లో కొనసాగింది. అసంపూర్తిగా ఉన్న దేవాదుల, బునాదిగాని కాల్వలను పార్టీ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ.. రైతులకు సాగు నీరు అందించడంలో పాలకులకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. ఏళ్లు గడుస్తున్నా సాగు నీటి కాల్వలు పూర్తి కావడం లేదన్నారు. పూర్తయిన చోట నీరు రాకపోవడంతో కంప చెట్లు మొలిచి, తూములు ధ్వంసమై ఆనవాళ్లు కోల్పోతున్నాయని పేర్కొన్నారు. సాగు, తాగునీటి కోసం ప్రజలు సంవత్సరాలుగా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్య, వైద్యం అందజేయడంలోనూ ప్రభుత్వం విఫలం కావడంతో ప్రజలు ప్రైవేట్ వైపు వెళుతున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఎమ్మెల్యేలు దృష్టి సారించాలని కోరారు. అదే విధంగా అడ్డగూడూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సీపీఎం నాయకులు సందర్శించారు. అత్యవసర సమయంలో రోగులు భువనగిరికి వెళ్లాల్సి వస్తుందని, పీహెచ్‌సీలో 24 గంటలు వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, రైతు సంఘం నాయకులు మాటూరి బాలరాజు, దాసరి పాండు, పైళ్ల యాదిరెడ్డి, మద్దెపురం రాజు, పోతరబోయిన సత్యనారాయణ, ఎండీ ఖలీల్, బాలయ్య, లింగయ్య, యాకన్న, సోమన్న, యాద్దిరెడ్డి, చిత్తలూరి మల్లయ్య , శ్రీనివాస్, బాలశౌరి, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 118 మంది ఎంపిక

భువనగిరి : జిల్లా కేంద్రంలోని శ్రీ సాయికృప డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం కృషి ఐటీఐ, సమర్థనం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాకు 956 మంది నిరుద్యోగ యువతి, యువకులు హాజరయ్యారు. వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన 118 మందిని ప్రైవేట్ రంగంలోని వివిధ కేటగిరీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ జేడీఎం కొత్తపల్లి రాజు, సమర్థనం ట్రస్ట్ నిర్వాహకులు సతీష్, మల్లికార్జున్, శ్రీనివాస్, జ్యోతి, ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాళ్లు రామోజీ రమేష్, శ్రావణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి బస్సు

మోత్కూరు : అరుణాచలం గిరిప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో నుంచి బస్సు నడపనున్నట్లు డిపో మేనేజర్ బందారపు శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 19న రాత్రి 8గంటలకు గుట్ట నుంచి బస్సు బయలుదేరి 20న కానిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్, అక్కడి నుంచి అరుణాచలం చేరుకుంటుందన్నారు. 21న గిరిప్రదక్షిణ, 22వ తేదీ సాయంత్రం గుట్టకు చేరుకుంటుందన్నారు.

ఊరూరా మీ సేవ కేంద్రాలు

- కొత్తగా తొమ్మిది మంజూరు
- విడతల వారీగా అన్ని గ్రామ పంచాయతీలకు విస్తరణ
- మహిళా స్వయం సహాయక సంఘాలకు నిర్వహణ బాధ్యతలు
- ఇంటర్, ఆపైన చదివిన సభ్యులను ఆపరేటర్లుగా ఎంపిక



అడ్డగూడూరులో మీ సేవ కేంద్రం ఏర్పాటు చేయడానికి గుర్తించిన భవనం

భువనగిరిటౌన్ : పట్టణాలు, మేజర్ గ్రామ పంచాయతీల్లోనే అందుబాటులో ఉన్న మీసేవ కేంద్రాలు ఇకనుంచి మారుమూల పల్లెల్లోనూ అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలో మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఈ ప్రక్రియను ప్రారంభించింది. ఇందులో భాగంగా యాదాద్రి జిల్లాకు తొలి విడతలో తొమ్మిది మీ సేవ కేంద్రాలు మంజూరు చేసింది. దశల వారీగా మిగతా గ్రామాలకు విస్తరించనున్నారు. మహిళా శక్తి పేరుతో ఏర్పాటు చేసే మీసేవ కేంద్రాలను మహిళా స్వయం సహాయక సంఘాలకే ప్రభుత్వం కేటాయించింది.

గ్రామం నుంచే 40 రకాల సేవలు

మీసేవ కేంద్రం ద్వారా 40 రకాల ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉంటాయి. ఆధార్, ధరణి, స్థానికత, ఆదాయ, కుల, జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు ఆర్టీసీ, రైల్వే తిరుపతి దర్శనం టిక్కెట్ల రిజర్వేషన్ల వంటి సేవలను ప్రజలు తమ గ్రామం నుంచే పొందే అవకాశం ఉంది. కొత్తగా ఏర్పాటు చేసే మీసేవ కేంద్రాలను జూలై 20వ తేదీనుంచి ప్రారంభించి ఆగస్టు 15నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నారు.

ఎంపిక విధానం ఇలా..

మీ సేవ కేంద్రాల నిర్వహణకు మహిళా సంఘాల్లోని సభ్యులను డీఆర్‌డీఏ అధికారులు ఎంపిక చేశారు. కొత్తగా మీ సేవ కేంద్రాలు మంజూరైన గ్రామాల్లో గ్రామైక్య సంఘాలతో సమావేశాలు నిర్వహించి ఉన్నత చదువు, కంపూటర్ పరిజ్ఞానం ఉన్న సభ్యులకు మొదటి ప్రాధాన్యం ఇచ్చారు. కేంద్రాల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ కేంద్రాలను ప్రభుత్వ భవనాల్లోనే ఏర్పాటు చేయనున్నారు. గ్రామ పంచాయతీలు, మహిళా సంఘాల భవనాలు, కమ్యూనిటీ భవనాలు, యువజన సంఘాల భవనాల్లో మాత్రమే ఏర్పాటు చేయాలని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది.

మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్న గ్రామ పంచాయతీలు ఇవే..

రామన్నపేట మండలం సిరిపురం, తుమ్మలగూడెం, బీబీనగర్, మోటకొండూర్, ఆలేరు మండలం కొలనుపాక, వలిగొండ మండలం మాంధాపురం, అడ్డగూడూరు, బొమ్మలరామారం, మర్యాలలో మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

ఎంపిక పూర్తి చేశాం

గ్రామాల్లో మీ సేవ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. మహిళా సమాఖ్యలతో సమావేశాలు నిర్వహించి మార్గదర్శకాల ప్రకారం ఎంపిక విధానం పూర్తి చేశాం . ఎంపికైన వారికి శిక్షణ ఇచ్చి మీ సేవ కేంద్రంలో కావాల్సిన సామగ్రి కోసం రుణం మంజూరు చేస్తాం.

–కృష్ణన్, డీఆర్‌డీఓ

రూ.2.50 లక్షల రుణ సహాయం

మీ సేవ కేంద్రాలు మంజూరైన వారికి వీటి ఏర్పాటు కోసం ప్రభుత్వం రుణసహాయం అందచేయాలని నిర్ణయించింది. మీ సేవ ఏర్పాటు చేసే సభ్యురాలికి గ్రామైక్య సంఘం సిఫారసుతో స్త్రీనిధి ద్వారా రూ.2.50లక్షల వరకు రుణం మంజూరు చేస్తారు. ఈ రుణంతో కంప్యూటర్, ప్రింటర్, కెమెరా, ఇంటర్నెట్, జీపీఎస్, బయోమెట్రిక్ పరికరాలు, టేబుల్స్ వంటివి సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం ద్వారా అందే దాదాపు 40 రకాల సేవల ద్వారా మీసేవ నిర్వాహకులకు ఆదాయం సమకూరుతుంది.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శనివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. శ్రీస్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం జోడు సేవలను మాడ వీధిలో ఊరేగించారు. వేద ఆశీర్వచనం, సువర్ణ పుష్పార్చన, నిత్యకల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

భువనగిరి క్రైం: భువనగిరి–వంగపల్లి రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలపై శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు భువనగిరి జీఆర్‌పీ ఇన్‌చార్జి హెడ్‌కానిస్టేబుల్ రజిత తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించినట్లు ఆమె పేర్కొన్నారు. మృతుడి వయస్సు సుమారు 45ఏళ్లు ఉంటుందని, ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కోదాడ శివారులో మరో మృతదేహం..

కోదాడరూరల్: కోదాడ పట్టణ పరిధిలోని దుర్గాపురం సమీపంలో శనివారం గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 70 ఏళ్లు ఉంటుందని అన్నారు. మృతుడు తెల్లటి చొక్కా, కళ్లజోడు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. కుళ్లిపోయే స్థితిలో ఉన్న మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ సూచించారు.

ఆర్‌ఐపై దాడి.. మైనర్లపై కేసు నమోదు

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై దాడి చేసిన ఇద్దరు మైనర్లపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. తిప్పర్తి ఎస్‌ఐ డి. రాజు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న నరహరి, ఇతర సిబ్బంది శుక్రవారం ధరణి పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తూ రాత్రి వరకు కార్యాలయంలో ఉన్నారు. అదే సమయంలో నరహరి ఆఫీసు బయటకు బహిర్భూమికి వెళ్లాడు. అక్కడ తిప్పర్తి మండలంలోని ఇద్దరు మైనర్లు మద్యం మత్తులో ఆర్‌ఐని బెదిరించి అతడిపై రాయి విసిరారు. ఆర్‌ఐ కేకలు వేయడంతో మైనర్లు బైక్‌పై అక్కడి నుంచి పరారయ్యారు. సమీపంలోనే మైనర్లు ఇద్దరు ఆగినట్లు గుర్తించిన తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని, ఆర్‌ఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధికి కృషి

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య ప్రతినిధులు


మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న టిఫ్ ప్రతినిధులు

చౌటుప్పల్: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామంలోని గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య(టిఫ్) ప్రతినిధుల బృందం శనివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లకు తూర్పు భాగంలోని యాదాద్రి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలు పారిశ్రామివాడల ఏర్పాటు అనువుగా ఉన్నాయని, ప్రభుత్వంతో కలిసి ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు సహకారం అందిస్తామని మంత్రికి తెలియజేశారు. దండుమల్కాపురం గ్రామంలోని గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ 1855 ఎకరాల్లో విస్తరించిందని, ఇక్కడ 1550 పరిశ్రమల ఏర్పాటు ద్వారా రూ.6675కోట్ల పెట్టుబడులు వస్తాయని, ప్రత్యక్షంగా 45వేల మందికి, పరోక్షంగా మరో 35వేల మందికి ఉపాధి లభిస్తుందని మంత్రికి వివరించారు. అదేవిధంగా పార్కు ప్రధాన ద్వారం వద్ద హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ఫ్లెక్లైవర్ బ్రిడ్జిని నిర్మించి ప్రమాదాలను నివారించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమ సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు.

స్థానిక యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయం: ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ పరిసర ప్రాంతాల్లోని యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. అందుకోసం ఇప్పటికే పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో సమీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య(టిఫ్) ప్రతినిధులు శనివారం ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి సత్కరించారు. పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉద్యోగాలు లేక గ్రామాల్లోని యువత చెడువ్యసనాలకు బానిసలుగా మారి తమ జీవితాలను ఆగం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చౌటుప్పల్ ప్రాంతానికి మరిన్ని పరిశ్రమలను తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఉన్న పరిశ్రమలతో పాటు నూతనంగా వచ్చే పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని యాజమాన్యాలకు సూచించారు. కార్యక్రమంలో టిఫ్ అధ్యక్షుడు కొండవీటి సుధీర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, టిఫ్ సీనియర్ జాయింట్ సెక్రటరీ మిరుపాల గోపాల్‌రావు, ప్రతినిధులు జలంధర్‌రెడ్డి, స్వామిగౌడ్, ఏఎల్ ఎన్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మోహన్, వెంకట్‌రెడ్డి, రంగారావు, వీరస్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టిఫ్ ప్రతినిధులు

జలశక్తి అభియాన్ బృందం పర్యటన

పెద్దఅడిశర్లపల్లి: జలశక్తి అభియాన్ బృందం ప్రతినిధులు శనివారం గుడిపల్లి మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా గుడిపల్లి మండల కేంద్రంలోని అవెన్యూ ప్లాంటేషన్, బత్తాయి తోటలు, ఇంకుడు గుంతలు, ఆయిల్ పామ్ తోటలను పరిశీలించారు. అనంతరం రైతు వేదిక వద్ద వన మహోత్సవంలో భాగంగా మొక్కను నాటారు. కార్యక్రమంలో కేంద్ర జలవనరుల శాక సహాయ కార్యదర్శి దివాకర్ మహంతి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, క్లస్టర్ ఏపీడీ బాలకృష్ణ, ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ శ్రీను, టీఏలు గిరిబాబు, దశరథరెడ్డి, అలివేలు, కార్యదర్శి నవీన్, క్షేత్ర సహాయకులు గోలి రవి, అనిత పాల్గొన్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జలశక్తి అభియాన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమానికి కేంద్ర జలవనరుల శాఖ సహాయ కార్యదర్శి దివాకర్ మహంతి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి హాజరై మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతుల భూముల్లో, ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో పండ్ల మొక్కలు, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించాలన్నారు. అనంతరం మథనాపురం, గొడుకొండ్ల గ్రామ పంచాయతీలను సందర్శించారు. వారి వెంట ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ ప్రవీణ్ శ్రీధర్, ఏపీఓ శౌరిరెడ్డి, ఎండీ జహంగీర్, సుధీర్, వెంకటయ్య, యాదయ్య, నాగరాజు, రవి, జ్యోతి ఉన్నారు.


చింతపల్లి: మొక్క నాటుతున్న దివాకర్ మహంతి, తదితరులు

ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక సమస్య

- మిర్యాలగూడలో రెండు గంటలపాటు నిలిచిన రైలు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడలో ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలు శనివారం ఉదయం సాంకేతిక సమస్యతో నిలిచిపోయింది. హౌరా నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న క్రమంలో ఓ బోగి చక్రంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దామరచర్ల మండలం కొండ్రపోల్ రైల్వే స్టేషన్ వద్ద స్టేషన్ మాస్టర్ రైలు బోగి చక్రం శబ్దంలో తేడా రావడాన్ని గమనించి రైల్వే స్టేషన్ అధికారులకు సమాచారం అందించాడు. అప్రమత్తమైన అధికారులు రైలును మిర్యాలగూడ స్టేషన్‌లో నిలిపివేశారు. టెక్నికల్ సిబ్బంది వచ్చి మరమ్మతులు చేయడంతో రైలు బయల్దేరి వెళ్లింది. రెండు గంటల పాటు రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు.


మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో నిలిచిన ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలు

ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం

- ముగ్గురిపై కేసు నమోదు

నడిగూడెం: ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు యత్నించిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నడిగూడెం మండలం సిరిపురం గ్రామంలోని సర్వే నంబర్ 311లో ఐదెకరాల ప్రభుత్వ భూమిని శనివారం అదే గ్రామానికి చెందిన మొక్క నర్సింహారావు, శ్రీను, వీరభద్రం చదును చేసి ఆక్రమించేందుకు యత్నించారు. తహసీల్దార్ హేమామాలిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

నూతనకల్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తి రోడ్డు పక్కన రేలింగ్‌ను ఢీకొట్టి మృతిచెందాడు. ఈ ఘటన నూతనకల్ మండలం ఎర్రపహాడ్ క్రాస్ రోడ్డు వద్ద శనివారం తెలవారుజామున జరిగింది. ఎస్‌ఐ జూకూరి సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండలం పెదనెమిల గ్రామానికి చెందిన తన్నీరు సత్యనారాయణ(44) కుమార్తె సూర్యాపేటలోని ఆస్పత్రిలో డెలివరీ కావడంతో ఆమెను చూసి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎర్రపహాడ్ క్రాస్ రోడ్డు సమీపంలో 365వ నంబర్ జాతీయ రహదారి మూలమలుపు వద్ద రోడ్డు పక్కన ఉన్న రేలింగ్‌ను ఢీకొట్టి తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఉమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తుంగతుర్తి ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎంజీయూలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో అధ్యాపకులు, విద్యార్థులకు న్యూఢిల్లీకి చెందిన ఎడ్యునెట్ ఫౌండేషన్, టాస్క్ సహకారంతో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నట్లు శనివారం యూనివర్సిటీ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఇందు కోసం రూ.30లక్షలతో 25 కంప్యూటర్లు సమాకూర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఎంజీయూ ఇంజనీరింగ్ కళాశాలలో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసి అధ్యాపకులు, 25 మంది ఎంసీఏ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చామన్నారు. ఈ శిక్షణకు మూడేళ్ల పాటు ఎడ్యునెట్ ఫౌండేషన్, టాస్క్ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ పవన్, సుమిత, రవీందర్‌సింగ్, మహేష్, మోహన్, శ్రీకాంత్, ప్రదీప్‌రెడ్డి, సుధీర్, రేఖ, హరీష్, జయంతి తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

సూర్యాపేట టౌన్: సూర్యాపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి తాళం వేసిన రెండు ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని భగత్సింగ్ నగర్‌లో అద్దెకు ఉంటున్న వట్టికూటి లింగయ్య శుక్రవారం బంధువుల ఊరికి వెళ్లాడు. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని తులంన్నర బంగారం, 15 తులాల వెండి ఎత్తుకెళ్లారు. శనివారం ఇంటికి వచ్చిన లింగయ్య తాళం పగులగొట్టి ఉండటంతో దొంగతనం జరిగిందని గ్రహించి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అదే విధంగా చింతల చెరువు రోడ్డులో మరొకరి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి క్వింటాల్‌న్నర బియ్యం, గ్యాస్ సిలిండర్ ఎత్తుకెళ్లారు. దీనికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

కోదాడరూరల్: కోదాడ పట్టణంలో నిషేధిత గుట్కా విక్రయిస్తున్న వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్ట్ చేసి రూ.63వేల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని మసీద్ కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న మహ్మద్ మోసిన్ కిరాణా షాపులో గుట్కాలు అమ్ముతున్నాడనే సమాచారం మేరకు దాడులు చేయగా రూ.63వేల విలువైన గుట్కాలు, పొగాకు ఉత్పత్తులు పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా నల్లగొండకు చెందిన మనోజ్, సూర్యాపేటకు చెందిన షేక్ నదీమ్ నుంచి గుట్కా ప్యాకెట్లు కొనుగోలు చేసి తన షాపులో విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడని, ఈ మేరకు సీఐ రాము కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీస్ స్టేషన్ గోడదూకి దొంగ పరార్

గరిడేపల్లి: విద్యుత్ మోటార్ల చోరీ కేసులో పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చిన దొంగ గోడదూకి పరారయ్యాడు. గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి, రంగాపురం, వెలిదండ గ్రామాల పరిధిలోని వ్యవసాయ బావుల వద్ద ఇటీవల దాదాపు 50 విద్యుత్ మోటార్లను దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో కొంత మంది రైతులు కాపుగాసి గురువారం ఓ దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారణ చేపట్టి మరో ఇద్దరు దొంగలను పోలీస్ స్టేషన్‌కు తీసుకొని వచ్చారు. శుక్రవారం రాత్రి అందులో ఒక దొంగ టాయిలెట్‌కి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లి పోలీస్ స్టేషన్ గోడదూకి పారిపోయాడు. దొంగను పట్టుకోవడానికి పోలీసులు గాలిస్తున్నారు.

అత్తపై కత్తితో దాడి చేసిన కోడలు

మోత్కూరు: మోత్కూరు మండలం రాగిబావి గ్రామంలో అత్తపై కత్తితో కోడలు దాడి చేసింది. ఈ ఘటన శనివారం జరిగింది. రాగిబావి గ్రామానికి చెందిన బాసాని సత్తమ్మతో ఆమె పెద్ద కోడలు జ్యోతి శనివారం సాయంత్రం గొడవ పెట్టుకుంది. ఈ క్రమంలో సత్తమ్మపై కత్తితో జ్యోతి దాడి చేసి పరారైంది. సత్తమ్మ తలకు తీవ్ర గాయంకావడంతో ఆమెను మోత్కూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. జ్యోతి, ఆమె భర్త కిష్టయ్య కొంతకాలంగా హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. రాగిబావి గ్రామంలోని తమ ఇంట్లో ఉంటున్న సత్తమ్మను ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని జ్యోతి కొద్దిరోజులుగా ఆమెతో గొడవ పడుతోంది. సత్తమ్మ ఎంతకూ ఇల్లు ఖాళీ చేయకపోవడంతో జ్యోతి శనివారం హైదరాబాద్ నుంచి వచ్చి కత్తితో దాడి చేసింది. సత్తమ్మ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైతులు సేంద్రియ వ్యవసాయం చేయాలి

- నాబార్డు ఏజీఎం సత్యనారాయణ


మాట్లాడుతున్న నాబార్డు ఏజీఎం సత్యనారాయణ

నడిగూడెం: రైతులు సేంద్రియ వ్యవసాయం చేసేందుకు మొగ్గు చూపాలని నాబార్డు ఏజీఎం సత్యనారాయణ అన్నారు. గత పదిహేను రోజులుగా నడిగూడెం మండలం సిరిపురం రైతు వేదికలో నాబార్డు ఆర్థిక సహకారంతో మల్లెల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పొదుపు సంఘాల మహిళలకు సేంద్రియ వ్యవసాయంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రసాయన ఎరువుల వాడకంతో భూసారం దెబ్బతింటుందన్నారు. రసాయనాలతో పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడం వలన రోగాలపాలవుతున్నామన్నారు. అలాగే స్వయం సహాయక సంఘాల సభ్యులు సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు తయారుచేయడానికి ముందుకొస్తే ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. అనంతరం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. మనతో పాటు, భవిష్యత్తు తరాలు కూడా ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయం చేపట్టాలన్నారు. సేంద్రియ సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమామాలిని, స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ యాదగిరి, మల్లెల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ మల్లెల కొండారెడ్డి, అభ్యుదయ రైతు వాసికర్ల శేషుకుమార్, నాగిరెడ్డి కవిత, బుచ్చిరాములు, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

మునగాల: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన ఇద్దరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం పల్లపట్ల గ్రామానికి చెందిన పవన్‌కుమార్, వెంకటకృష్ణ, మరో వ్యక్తి కలిసి శుక్రవారం బైక్‌పై హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి స్కూటీపై బయల్దేరారు. మార్గమధ్యలో మునగాల మండలం మాధవరం గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై నేలమర్రి క్రాస్ రోడ్డు వద్ద ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో పవన్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్ర గాయాలపాలైన వెంకటకృష్ణతో పాటు మరో వ్యక్తిని పోలీసులు సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ వెంకటకృష్ణ శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందినట్లు స్థానిక ఏఎస్‌ఐ కల్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

పిల్లలమర్రి గ్రామానికి చెందిన వృద్ధురాలు..

పెన్‌పహాడ్: సూర్యాపేట మండలం పిల్లలమర్రి గ్రామానికి చెందిన చెర్కుపల్లి గుర్వమ్మ(72) గత నెల పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామంలోని తన రెండో చెల్లెలి ఇంటికి వచ్చింది. గత నెల 24వ తేదీన అక్కడి నుంచి నాగులపహాడ్‌లో ఉంటున్న తన మూడో చెల్లె ఒగ్గు లక్ష్మి ఇంటికి ఆమె కుమారుడు ఒగ్గు అశోక్ బైక్‌పై గుర్వమ్మను తీసుకెళ్తుండగా అనంతారం గ్రామ శివారులో గేదెలు అడ్డు రావడంతో అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో గుర్వమ్మ తలకు తీవ్రగాయాలు కావడంతో ఆమెను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి మేనల్లుడు మామిడి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ వెంకటరత్నం పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో ఇద్దరు దొంగలు

- నిందితుల నుంచి కత్తి, ద్విచక్ర వాహనం స్వాధీనం

చౌటుప్పల్: దొంగతనాలు చేసేందుకు వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామ శివారులోని టోల్‌ప్లాజా వద్ద శనివారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరికి చెందిన మక్కనోల్ల పవన్‌కుమార్, మల్కాజ్‌గిరిలోనే నివాసం ఉంటున్న మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పెద్ద అడవిరాళ్ల గ్రామానికి చెందిన బరిగెల శివకుమార్ కూలీ పనులు చేస్తుంటారు. వీరు దొంగతనాలకు పాల్పడుతుంటారు. ఈ క్రమంలో శనివారం ద్విచక్ర వాహనంపై చౌటుప్పల్ మీదుగా విజయవాడ వైపు వెళ్తుండగా.. చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు చేస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుంటుండగా.. తమ వెంట ఉన్న కత్తితో పోలీసులపై దాడి చేసేందుకు యత్నించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా చోరీలు చేసేందుకు వెళ్తున్నట్లు నిజం ఒప్పుకున్నారు. వీరిపై హైదరాబాద్ సీసీఎస్‌తో పాటు మల్కాజ్‌గిరి పోలీస్ స్టేషన్‌లోనూ పలు కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి పేర్కొన్నారు.

పీఈటీ ఉపాధ్యాయుడికి ఘనంగా వీడ్కోలు

నిడమనూరు: 13ఏళ్లు ఒకే పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న పీఈటీ సార్‌కు గ్రామస్తులు, విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. నిడమనూరు మండలం ముకుందాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న సత్యనారాయణకు పీడీగా ప్రమోషన్ రావడంతో తిరుమలగిరి ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. ముకుందాపురం పాఠశాలకు 2011లో బదిలీపై వచ్చిన ఆయన పాఠశాల విద్యార్థులను వాలీబాల్‌లో జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. గతంలోనే ఆయన వేరే పాఠశాలకు బదిలీ అయినప్పటికీ విద్యార్థుల వినతి మేరకు బదిలీ ప్రక్రియను నిలిపివేశారు. శనివారం పీఈటీ సత్యనారాయణను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గ్రామంలో ఊరేగించారు. ఇన్నాళ్లు తమను ఆటలు ఆడించిన సారు తన పాఠశాల నుంచి వెళ్లిపోతుండడంతో విద్యార్థులు కన్నీటిపర్యంతమయ్యారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చూపిస్తున్న అభిమానం వెలకట్టలేనిదని సత్యనారాయణ అన్నారు.


బదిలీపై వెళ్తున్న పీఈటీ సత్యనారాయణను ఊరేగిస్తున్న విద్యార్థులు

పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ధర్నా

కోదాడ రూరల్: భూమి పంచాయితీలో తమకు న్యాయం చేయకపోగా.. సీఐ తమనే ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపిస్తూ కోదాడ పట్టణ పరిధిలోని తమ్మర గ్రామానికి చెందిన ఎస్. ధనలక్ష్మికి పలువురు మహిళలతో కలిసి శనివారం కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. ధనలక్ష్మికి తన తండ్రి పసుపుకుంకుమ కింద ఇచ్చిన భూమిలో తన వాటా ఇవ్వకుండా ఆమె సోదరుడు మరొకరికి విక్రయించాడు. దీనిపై పంచాయితీ నడుస్తోంది. అయితే కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకున్నప్పటికీ ఆ స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధితురాలు ఆరోపించింది. అంతేకాకుండా తమనే సీఐ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి భయభ్రాంతులకు గురిచేసి దుర్భాషలాడాడని వాపోయింది. దీనిపై పట్టణ సీఐ రామును వివరణ కోరగా.. బాధితురాలు భూమి పంచాయితీలో న్యాయం చేయమని తమను ఆశ్రయించారని, కానీ అది తమ పరిధిలోకి రాదని చెప్పడంతో ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.

పీడీఎస్ బియ్యం దందాలో రేషన్ డీలర్లు

- వాడపల్లి వద్ద పట్టుబడిన 22 టన్నుల పీడీఎస్ బియ్యం
- కీలకంగా వ్యవహరించిన నేరేడుచర్ల మండలానికి చెందిన ముగ్గురు డీలర్లు
- ఒకరిపై కేసు నమోదు
- మరో ఇద్దరు డీలర్లను విచారిస్తున్న పోలీసులు, సివిల్ సప్లయ్ అధికారులు


తహసీల్దార్ వద్ద బైండోవర్ చేస్తున్న పోలీసులు

నేరేడుచర్ల: పీడీఎస్ బియ్య దందాలో పలువురు రేషన్ డీలర్లు కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. దామరచర్ల మండలం వాడపల్లి వద్ద శుక్రవారం పోలీసుల తనిఖీల్లో ఆంధ్రప్రదేశ్‌కు లారీలో తరలిస్తున్న 22టన్నుల పీడీఎస్ బియ్యం పట్టుబడింది. ఈ పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాలో నేరేడుచర్ల మండలానికి చెందిన రేషన్ డీలర్లు కీలకంగా వ్యవహరించడంతో జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు అప్రమత్తమయ్యారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరేడుచర్ల మండల మేడారం గ్రామ రేషన్ డీలర్ కరణం పాండయ్య పేరు చెప్పడంతో అతడిని పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఇందులో బక్కయ్యగూడెం, పెంచికల్‌దిన్నె రేషన్ డీలర్లు కోన సత్యం, మిట్ట రాజేశ్వరి పాత్ర కూడా ఉన్నట్లు తెలియడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మేడారం గ్రామ డీలర్ పాండయ్యకు స్టాక్ కేటాయించినప్పటికీ తీసుకురాలేదని విచారణకు వెళ్లిన సివిల్ సప్లయ్ అధికారులు నిర్ధారించారు. దీంతో 22 టన్నుల పీడీఎస్ బియ్యం ఎక్కడికి తీసుకెళ్తున్నారనే విషయంపై అధికారులు దృష్టి సారించారు.

విచారణ చేపడుతున్నాం..

సామాజిక మాధ్యమాల ద్వారా 22 టన్నుల రేషన్ బియ్యం పట్టుబడిన విషయం తెలుసుకుని మేడారం గ్రామ రేషన్ డీలర్ పాండయ్యకు సంబంధించిన స్టాక్‌ను పరిశీలించినట్లు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్ తెలిపారు. ఈ నెల అతడు స్టాక్ తీసుకురాలేదని తేలడంతో విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అతడిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసిందని, తమకు ఎఫ్ఐఆర్ కాపీ అందితే చర్యలు తీసుకుంటామని వివరించారు. పెంచికల్‌దిన్నె, బక్కయ్యగూడెం గ్రామాల రేషన్ డీలర్లను కూడా విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

నలుగురి బైండోవర్..

నేరేడుచర్ల మండలంలో గతంలో పీడీఎస్ బియ్యం దందాకు పాల్పడిన నలుగురిని బైండోవర్ చేసినట్లు స్థానిక ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపారు. గతంలో 9 మంది పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నామని, అందులో మిర్యాలగూడకు చెందిన మేషవరపు కృష్ణ, పులగంబండతండాకు చెందిన బానోతు నాగు, బానోతు ఉపేందర్, హుజూర్‌నగర్‌కు చెందిన కావలి ముసలిని పిలిపించి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

పౌరసరఫరాల శాఖ గోదాము తనిఖీ..

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లోని పౌరసరఫరాల శాఖ గోదామును జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములోని స్టాక్‌ను పరిశీలించారు. స్టాక్‌లో 424 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. హుజూర్‌నగర్ ప్రాంతానికి చెందిన రేషన్ బియ్యం దామరచర్ల మండలం వాడపల్లి వద్ద పట్టుబడ్డ నేపథ్యంలో తనిఖీలు చేపట్టినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాములు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని పేర్కొన్నారు. ఆయన వెంట ఏఎస్‌ఓ పుల్లయ్య, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్ ఉన్నారు.